

# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 29-11-2025 | సంపుటి - 25 | సంచిక -192 | రూ : 4 | పేజీలు: 8

## హైటెక్ సిటీతో పోటీపడే విధంగా

### రైల్వే స్టేషన్ అభివృద్ధి: కిషన్ రెడ్డి



2లో

- హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన కిషన్ రెడ్డి
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడి
- నగరంలోని అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని వెల్లడి



2లో

## నేటితో మెట్రోకు 8 ఏళ్లు..

- 80 కోట్ల మంది ప్రయాణం
- హైదరాబాద్ మెట్రో రైలు విజయవంతంగా ఏడేళ్లు పూర్తి
- ప్రయాణికుల్లో 51 శాతానికి పైగా ఉద్యోగులేనని సర్వేలో వెల్లడి
- రూ.43,848 కోట్లతో రెండో దశ విస్తరణకు ప్రభుత్వ ప్రణాళికలు

## హైదరాబాద్‌లో మరోసారి రికార్డు ధర..

### కోకాపేటలో ఎకరం రూ.150 కోట్లు

- గండిపేట మండలం కోకాపేటలో ఎకరం భూమి రూ.151.25 కోట్లు
- నియోపొలిస్ లేఅవుట్ ప్లాట్ నెంబర్ 15, 16లో వేలం
- 9.06 ఎకరాలను వేలం వేయగా సమకూరిన రూ.1,353 కోట్ల ఆదాయం




2లో

## ప్రపంచంలోనే ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని

- గోవాలో 77 అడుగుల శ్రీరాముడి విగ్రహం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రాముడి విగ్రహంగా గుర్తింపు
- 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' శిల్పి రామ్ సుతార్ రూపకల్పన
- ఉడిపిలో లక్ష కంఠ గీతా పారాయణంలో పాల్గొన్న ప్రధాని
- ఉడిపి సుపరిపాలన నమూనాను గుర్తు చేసుకున్న మోదీ

2లో





## గ్రామ పంచాయతీ ఎన్నికలు..

### రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారు

- డిసెంబర్ 1 నుంచి ఒక్కో జిల్లాలో ఒక్కోరోజు పర్యటించనున్న ముఖ్యమంత్రి
- డిసెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ముఖ్యమంత్రి పర్యటన
- మక్తల్, కొత్తగూడెం, హుస్నాబాద్, నర్సంపేట, దేవరకొండలలో పర్యటన



2లో

## సర్పంచ్ ఎన్నికల్లో నోటా గుర్తు



2లో

- బ్యాలెట్ చివరి గుర్తి నోటా ఉండాలని ఈసీ ఆదేశం
- సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల గుర్తులను విడుదల చేసిన ఈసీ
- తెలంగాణలో మొదలైన పంచాయతీ ఎన్నికల ప్రక్రియ

## అమరావతి రెండో దశకు శ్రీకారం..

కొత్తగా 20 వేల ఎకరాల సమీకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

2లో

- అమరావతి రెండో దశ భూ సమీకరణకు ఏపీ కేబినెట్ ఆమోదం
- ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల సేకరణకు నిర్ణయం
- ప్రభుత్వ భూమితో కలిపి మొత్తం 20 వేల ఎకరాలు సమీకరించాలని లక్ష్యం



# ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

గోవా, నవంబర్ 28 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం దక్షిణ గోవాలో పర్యటించి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పార్తగాలిలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఈ భారీ కంచు విగ్రహాన్ని ఆయన జాతికి అంకితం చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం ప్రధాని మఠంలోని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగింది. గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (ఐక్యతా విగ్రహం) రూపశిల్పి రామ్ సుతార్ ఈ శ్రీరాముడి విగ్రహాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన గోకర్ణ జీవోత్తమ్ మఠం భారతదేశంలోని పురాతన మఠాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సేవలో ఈ మఠం పాత్ర ఎనలేనిది. ముఖ్యంగా సారస్వత బ్రాహ్మణ సమాజంలో ఈ మఠానికి విశిష్ట స్థానం ఉంది. మఠం స్థాపించి 550 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 27 నుంచి డిసెంబర్ 7 వరకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 370 ఏళ్ల క్రితం గోవాలోని కనకోనా ప్రాంతంలోని పార్తగాలి గ్రామంలో ఈ మఠ ప్రాంగణాన్ని నిర్మించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ 7,000 నుంచి 10,000 మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. గోవా పర్యటనకు ముందు, ప్రధాని మోదీ కర్ణాటకలోని ఉడిపిలో పర్యటించారు. ఉడిపి శ్రీకృష్ణ మఠంలో నిర్వహించిన 'లక్ష కంఠ గీతా పారాయణం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లక్ష మంది విద్యార్థులు, పండితులు, సన్యాసులు, సాధారణ పౌరులతో కలిసి భగవద్గీత శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గర్భగుడి ఎదుట నిర్మించిన సువర్ణ తీర్థ మంటపాన్ని ప్రారంభించారు. అలాగే, కనకదాసు శ్రీకృష్ణుడిని దర్శించుకున్న పవిత్ర కిటికీ 'కనకన కిండి'కి బంగారు కవచాన్ని (కనక కవచం) సమర్పించారు.



# సర్పంచ్ ఎన్నికల్లో నోటా గుర్తు

తెలంగాణ, నవంబర్ 28 : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఫ్రీ సింబల్స్ ను ప్రకటించింది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల గుర్తులను విడుదల చేసింది. బ్యాలెట్ చివరి గుర్తు నోటా ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లకు ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే మొదటి విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి విడత జరిగే గ్రామ పంచాయతీల్లో వార్డు, సర్పంచ్ ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ అయింది. అభ్యర్థుల నుంచి నామినేషన్‌లను స్వీకరిస్తున్నారు. గ్రామాల్లో ప్రధాన పార్టీలు తమ పార్టీల తరపున అభ్యర్థులను నిలబెడుతున్నాయి. పెద్ద ఎత్తున స్వతంత్రులు బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీల గుర్తుల మీద జరగవు. కాబట్టి ఎన్నికల సంఘం కొన్ని గుర్తులను (ఫ్రీ సింబల్స్) విడుదల చేస్తుంది. ఆయా పార్టీలు తమ తమ అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ అది అనధికారికమే. ఏ పార్టీ గుర్తు ఉండదు. ఆయా పార్టీలు తమ తమ అభ్యర్థులను ఎంచుకుని తమ 'పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి'గా ప్రచారం చేసుకుంటారు. ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికలకు 30, వార్డు సభ్యుల కోసం 20 గుర్తులను కేటాయించింది. రాష్ట్రంలో గుర్తింపు లేని, రిజిస్టర్ అయిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల సంఘం విడుదల చేసే ఫ్రీ సింబల్స్‌ను ఎంచుకోవచ్చు.

# హైటెక్ సిటీతో పోటీపడే విధంగా రైల్వే స్టేషన్ అభివృద్ధి

హైదరాబాద్, నవంబర్ 28 : హైటెక్ సిటీతో పోటీపడే విధంగా రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు ఆయన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. హైటెక్ సిటీతో పోటీ పడే విధంగా ఇక్కడి స్టేషన్‌ల నిర్మాణాలు ఉంటాయని ఆయన అన్నారు. రూ.35 కోట్లతో రెండు విడతలుగా పనులు జరుగుతున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. 2026 ఫిబ్రవరి లోపు తొలి విడత పూర్తవుతుందని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా 16 ప్రత్యేక రైళ్లను నగరంలో ఆపుతామని తెలిపారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలు..

# రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారు

హైదరాబాద్, నవంబర్ 28 : తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆయన ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో పర్యటించనున్నారు. డిసెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ఆయన పర్యటన కొనసాగనుంది. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్, డిసెంబర్ 2న ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, డిసెంబర్ 3న కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, డిసెంబర్ 4న ఆదిలాబాద్, డిసెంబర్ 5న నర్సంపేట, డిసెంబర్ 6న నల్గొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతాల్లో ఆయన పర్యటన సాగుతుంది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. మూడు దఫాలుగా ఎన్నికలు జరగనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. మొదటి దశ నామినేషన్లు నవంబర్ 27న ప్రారంభం కాగా పోలింగ్ డిసెంబర్ 11వ తేదీన జరగనుంది. రెండవ దశ నామినేషన్లు నవంబర్ 30న, మూడవ దశ నామినేషన్లు డిసెంబర్ 3న ప్రారంభం కానుండగా, రెండో దశ పోలింగ్ డిసెంబర్ 14న, మూడో దశ పోలింగ్ 17న జరగనుంది.

## హైదరాబాద్‌లో మరోసారి రికార్డు ధర...

# కోకాపేటలో ఎకరం రూ.150 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 28 : హైదరాబాద్ నగర శివారులోని కోకాపేటలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా జరిగిన వేలంలో ఎకరం భూమి ఏకంగా రూ.150 కోట్లకు పైగా పలికింది. గండిపేట మండలం పరిధిలోని కోకాపేటలో ఇటీవల భూముల ధరలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ వేలంలో ఎకరం భూమి ధర రూ.151.25 కోట్లకు చేరింది. నియోపొలిస్‌లోని ప్లాట్ నెంబర్ 15, 16లలోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా రూ.1,353 కోట్ల ఆదాయం లభించింది. గతంలో ప్లాట్ నెంబర్ 17, 18లను వేలం వేయగా ఎకరం రూ.137.25 కోట్లు పలికింది. అంతకుముందు టీజీఐఐసీ భూముల్లో ఎకరా ధర రూ.177 కోట్లుగా నమోదైన విషయం విదితమే. నియోపొలిస్‌లో 2023లో ఎకరా భూమి సగటున రూ.73 కోట్లు పలికింది. ఇప్పుడు ఆ ధర దాదాపు రెండింతలు పెరిగింది

# నేటితో మెట్రోకు 8 ఏళ్లు.. 80 కోట్ల మంది ప్రయాణం

హైదరాబాద్, నవంబర్ 28 : నగరవాసులకు వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు ఏడేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని నేటితో ఎనిమిదో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెడుతూ, లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న మెట్రో, ఇప్పుడు రెండో దశ విస్తరణకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం నగరంలో 69.2 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో మెట్రో సేవలు అందిస్తోంది. నిత్యం సుమారు 4.80 లక్షల మంది ప్రయాణిస్తుండగా, వీరిలో 51.5 శాతం మంది ఉద్యోగులే ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. త్వరగా గమ్యస్థానాలకు చేరుకునేందుకు 30.3 శాతం మంది, విద్యార్థులు 6.1 శాతం మంది మెట్రోను ఆశ్రయిస్తున్నారు. 2017 నవంబర్ 29న ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 80.21 కోట్ల మంది మెట్రోలో ప్రయాణించినట్లు అంచనా. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. 2012లో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో రూ.14,132 కోట్ల వ్యయంతో మెట్రో ప్రాజెక్టును ప్రారంభించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రెండో దశ విస్తరణపై దృష్టి సారించింది. మొత్తం ఎనిమిది కారిడార్లలో 163 కిలోమీటర్ల మేర కొత్త లైన్లను రూ.43,848 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్) కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. 2026 మార్చి నాటికి వీటికి అనుమతులు లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రెండో దశ పూర్తయితే మహానగర రవాణా వ్యవస్థలో మెట్రో మరింత కీలకం కానుంది.

# అమరావతి రెండో దశకు శ్రీకారం

## కొత్తగా 20 వేల ఎకరాల సమీకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

అమరావతి, నవంబర్ 28 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రెండో దశ భూ సమీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇస్తూ మంత్రివర్గం తీర్మానించింది. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించాలన్నా, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ, రైల్వే స్టేషన్ వంటి భారీ మౌలిక సదుపాయాలు నిర్మించాలన్నా భూమి అత్యవసరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారమే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, కేబినెట్ సమావేశంలో రెండో దశ భూ సమీకరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో భూసేకరణ చేపట్టబోయే గ్రామాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి గ్రామాలను అధికారులు ప్రతిపాదించారు. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్య వివరాలపై అధికారులు సమర్పించిన నివేదికలను కేబినెట్ పరిశీలించింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 16,666 ఎకరాలతో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూములను కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మొదటి విడతలో రైతుల నుంచి సుమారు 34,000 ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. తాజాగా రెండో విడతలో మరో 20,000 ఎకరాలు సేకరించనున్నారు. వీటికి అదనంగా, సుమారు 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సీఆర్డీఏకు అప్పగించనున్నారు. దీంతో రాజధాని నిర్మాణం కోసం మొత్తం దాదాపు 70,000 ఎకరాల భూమి అందుబాటులోకి రానుంది.

*** రైతులు సహకరించాలి: సీఎం చంద్రబాబు**

ఈ నేపథ్యంలోనే గురువారం సచివాలయంలో రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో, రాజధాని అభివృద్ధికి రైతులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. రైతుల సహకారం లేకపోతే అమరావతి కేవలం ఒక మున్సిపాలిటీగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్గత విభేదాలు, అనవసరమైన జేఏసీలతో సమస్యలు సృష్టించవద్దని, ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియాలో చర్చ చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. రైతులంతా కలిసికట్టుగా ఒకే 'అమరావతి అభివృద్ధి కమిటీ'గా ఏర్పడి రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కేబినెట్ నిర్ణయంతో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

# థాయ్‌లాండ్‌ను ముంచెత్తిన వరదలు... 145 మంది మృతి

థాయ్‌లాండ్, నవంబర్ 28 : దక్షిణ థాయ్‌లాండ్‌లో సంభవించిన తీవ్ర వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో మరణించిన వారి సంఖ్య 145కి చేరినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. అసోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం, కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా 12 దక్షిణ ప్రావిన్సుల్లోని 12 లక్షల కుటుంబాలకు చెందిన సుమారు 36 లక్షల మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. వరద నీరు నెమ్మదిగా తగ్గుముఖం పడుతుండటంతో సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు విపత్తు నివారణ శాఖ తెలిపింది. ప్రభుత్వ అధికార ప్రతినిధి సిరిపాంగ్ అంగ్‌కాసాకుల్కియాట్ మాట్లాడుతూ... ఎనిమిది ప్రావిన్సుల్లో 145 మంది మరణించగా, ఒక్క సోంగ్‌ఖ్లా ప్రావిన్స్‌లోనే 110 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ముఖ్యంగా, ఆ ప్రాంతంలోని అతిపెద్ద నగరమైన హ్యాట్ యాయ్‌లో వరద తగ్గాక, శిథిలాల కింద చిక్కుకున్న మరిన్ని మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీస్తున్నాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ సోంగ్‌ఖ్లాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇది మునుపెన్నడూ చూడని విపత్తు అని ఆయన అభివర్ణించారు. స్థానిక ఆసుపత్రులపై భారం తగ్గించడానికి హ్యాట్ యాయ్ హాస్పిటల్ కోసం ప్రత్యేకంగా ఎనిమిది ఫీల్డ్ ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్యం అవసరమైన 20 మంది రోగులను గురువారం హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హ్యాట్ యాయ్ జిల్లాలో ఏర్పాటు చేసిన 16 పునరావాస కేంద్రాలకు 16,000 మందికి పైగా ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. గతవారం కేవలం మూడు రోజుల్లోనే హ్యాట్ యాయ్, దాని పరిసర ప్రాంతాల్లో 630 మిల్లీమీటర్ల (25 అంగుళాలు) రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వరదల కారణంగా రోడ్లు కొట్టుకుపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వాహనాలు ఒకదానిపై ఒకటి పేరుకుపోవడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించాయి. ఒకప్పుడు మార్కెట్లు, స్ట్రీట్ ఫుడ్‌తో పర్యాటకులను ఆకర్షించే హ్యాట్ యాయ్ నగరం ఇప్పుడు పూర్తిగా బురదమయంగా మారింది. ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో పేరుకుపోయిన బురదను, శిథిలాలను తొలగించేందుకు స్థానికులు శ్రమిస్తున్నారు.

## జీహెచ్ఎంసీలో

# విలీనం చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యం?

హైదరాబాద్, నవంబర్ 28 : జీహెచ్ఎంసీ పరిధిని పెంచేందుకు, గ్రేటర్ బయట ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల ఉన్న 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లను జోడించి జీహెచ్ఎంసీలో విలీనం చేసి మహా నగరంగా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి బీజేపీ వ్యతిరేకమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చెప్పారు. శుక్రవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం డీసెంట్రలైజేషన్ అవసరం కానీ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సెంట్రలైజేషన్ నిర్ణయం ప్రజలకు నష్టం చేస్తుందన్నారు. జీహెచ్ఎంసీలో విలీనం



చేసినట్లయితే 2 కోట్లకు పైగా జనాభా గ్రేటర్ పరిధిలోకి వస్తుందని.. ఇంత పెద్ద జనాభా నిర్వహణకు అవసరమైన సదుపాయాలు లేవని.. పైగా ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందని చెప్పారు. గతంలో ఎంసీహెచ్ ఉండేదని.. దాన్ని జీహెచ్ఎంసీగా మార్చారని.. అప్పట్లో కొన్ని గ్రామీణ ప్రాంతాలను మున్సిపాలిటీల్లో జోడించి, ఆ మున్సిపాలిటీలను మళ్లీ కలిపారని తెలిపారు. ఏడాది క్రితమే మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకొచ్చిన గ్రామీణ ప్రాంతాలను ఇప్పుడు జీహెచ్ఎంసీలో జోడించడం వల్ల ప్రజలకు మరింత నష్టం జరగనుందని ఆరోపించారు. గతంలో ఎంసీహెచ్ నుంచి జీహెచ్ఎంసీగా మార్చినప్పుడు, బంజారాహిల్స్‌లో ట్యాక్స్‌స్ట్రక్చర్ తక్కువగా ఉండగా, మల్కాజ్‌గిరిలో ఎక్కువ పన్నులు విధించారని.. జీహెచ్ఎంసీలో కొత్తగా కలిసిన ప్రాంతాల ప్రజలపై అధిక పన్నుల భారం పడిందన్నారు. ఇప్పుడు కూడా విలీనంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలపై ఇలాంటి పన్ను భారం మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీలో నిధుల కొరత తీవ్రంగా ఉన్నదని.. మున్సిపాలిటీల్లో అభివృద్ధి లేదని.. విలీనం చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

*** విలీనం అయితే మున్సిపాలిటీల్లో అభివృద్ధి ఎలా?**

ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొన్నది.. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నదని.. డ్రైనేజ్ సమస్యలు, చెత్త నిర్వహణలో వైఫల్యం చెందారని రాంచందర్‌రావు ఆరోపించారు. అలాగే.. స్ట్రీట్ లైట్లు, వాటర్ వర్క్స్‌లో నిర్లక్ష్యం ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపాలిటీలు అభివృద్ధి చేయలేనప్పుడు జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం వల్ల పరిస్థితి ఎలా మెరుగుపడుతుందని నిలదీశారు. హైదరాబాద్ నగరాన్ని మహానగరంగా మార్చాలనే నిర్ణయంతో ఇక్కడ ఇప్పటికే ఉన్న 1.70 కోట్ల జనాభా 2 కోట్లకు పైగా పెరిగి, పరిపాలన పూర్తిగా క్లిష్టతరమవుతుందని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తుగ్లక్ పనులు చేసినట్లు ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తున్నదని తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు టిఫిన్ బాక్సులు పంపిణీ

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు పట్టణంలోని స్టేషన్ బస్తికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రవి నాయక్ మాతృమూర్తి బానోత్ సోనీ ఇటీవల మృతి చెందారు. రవి నాయక్ తన తల్లి జ్ఞాపకార్థంగా ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల లో మహిళ రోగులకు ఉపయోగపడే ఒక బెడ్ ను బహుకరణ చేశారు. అదేవిధంగా తన ఏరియా పరిధిలోని ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు టిఫిన్ బాక్స్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవి నాయక్ వెంట బానోత్ లస్కర్, రామ్ సింగ్, శంకర్, రాములు, ఇందిరా, మహేందర్, ప్రకాష్, సుమన్, మేకల శ్యామ్ మాదిగ, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ రామ్ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో పదోన్నతులు బాధ్యతలను మరింతగా పెంచుతాయి

*** ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాకు కేటాయించబడిన నూతన హెడ్ కానిస్టేబుళ్లు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.1998 బ్యాచ్‌కు చెందిన ఈ 14 మంది అధికారులు కానిస్టేబుళ్లుగా విధులు ప్రారంభించి, ఇటీవల హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు పొంది ఖమ్మం జిల్లా నుండి భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీపై రిపోర్ట్ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు వారికి అభినందనలు తెలియజేస్తూ పోలీస్ శాఖలో పదోన్నతులు కేవలం గౌరవమే కాదు, అదనపు బాధ్యతలకూ సంకేతం. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే వారికి శాఖ ఎప్పటికైనా సరైన గుర్తింపు ఇస్తుంది" అని పేర్కొన్నారు. అధికారులుగా తమ విధులను మరింత సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను సమయానుసారం పాటించాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఖాళీలను పరిశీలించి, వారు పెట్టుకున్న అర్జీల ప్రకారం త్వరలో పోస్టింగులు కల్పిస్తామని ఎస్పీ తెలిపారు.

## బెల్ట్ షాపుల నిర్వాహకుల బైండోవర్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిధిలో బెల్ట్ షాపు నిర్వహకులను బైండోవర్ చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 19వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు మార్గం శేఖర్ యాదవ్ మేనకోడలు చార్విక పుట్టిన రోజును పురస్కరించుకొని శుక్రవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తౌర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్, దాసరి మురళిస్వామి, వంగూరి శ్రీను, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, అందోజు సన్నిధ్ చారి, అప్పిడి శేఖర్ రెడ్డి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తౌర్పునూరి సాయి, తౌర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫేర్‌లో తృతీయ స్థానం సాధించిన లక్ష్మి కౌముది



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పిడతల లక్ష్మి కౌముది తృతీయ స్థానం సాధించి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా అవార్డు, మెమెంటో, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. మూడు రోజుల పాటు సెయింట్ మేరీస్ పాఠశాలలో జరిగిన ఈ సైన్స్‌ఫేర్‌లో వేస్ట్ మేనేజ్‌మెంట్ కేటగిరిలో లక్ష్మి కౌముది ఇచ్చిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. గుట్టలుగా పేరుకుపోతున్న ప్లాస్టిక్‌ను ఏ విధంగా ఉపయోగకరంగా మార్చుకోవచ్చు అనేది లక్ష్మి కౌముది ఇచ్చిన ప్రదర్శన. ఇళ్లు, షాపులు, పరిశ్రమల నుంచి సేకరించిన చెత్తలో నుంచి ఇనుము, ప్లాస్టిక్‌ను వేరు చేసిన తరువాత ఆ ప్లాస్టిక్‌ను మిషన్ వేసి ముక్కలుగా కట్ చేసి, అక్కడి నుంచి కట్ చేసిన ప్లాస్టిక్ ముక్కలు హీటింగ్ ఛాంబర్‌లోకి వెళ్తాయి. ఆయొక్క హీటింగ్ ఛాంబర్‌లో కొన్ని రకాల రసాయన ఉత్ప్రేరకాలు కలిపి అత్యధిక ఉష్ణోగ్రతలో ప్లాస్టిక్ కరిగిపోయే విధంగా చేయడం ద్వారా ప్లాస్టిక్ నుంచి గ్యాస్ వెలువడుతుంది. ఆ గ్యాస్ కూలింగ్ ఛాంబర్‌లోకి వెళ్లినప్పుడు దానిని చల్లబరచడం ద్వారా గ్యాస్ అనేది లిక్విడ్‌గా మారి ఆయిల్ ఛాంబర్‌లోకి వెళ్తుంది. ఈ విధంగా వచ్చిన ఇంధనాన్ని పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునే వీలుంటుంది. అదేవిధంగా హీటింగ్ ఛాంబర్‌లో మిగిలిన ప్లాస్టిక్ (కార్బన్ బ్లాక్) ను బూడిదగా వినియోగించి ఇటుకలు వంటివి తయారుచేసుకోవచ్చునని లక్ష్మి కౌముది తెలిపింది. ఈ యొక్క ప్రదర్శనకు గైడ్ టీచర్‌గా ప్రేమకుమారి వ్యవహరించారు. ప్లాస్టిక్ వ్యర్థాన్ని వినియోగించి ఎంతో ఉపయోగకరమైన ఆయిల్‌గా ఎలా మార్చడం అనేదానిపై లక్ష్మి కౌముది ఇచ్చిన ప్రదర్శనకుగాను తృతీయ బహుమతి లభించింది. అదేవిధంగా డ్రాయింగ్ పోటీలోనూ 'వికసిత్ భారత్' అంశంలో లక్ష్మి కౌముది సెకండ్ ప్రైజ్ సాధించింది. కలెక్టర్ చేతులమీదుగా బహుమతి అందుకున్న లక్ష్మి కౌముదిని పాఠశాల హెచ్ఎం సిస్టర్ రూబి, అసిస్టెంట్ హెచ్ఎం సిస్టర్ నిర్మల, తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, రజని అభినందించారు.



## జిల్లా ఆసుపత్రుల సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

*** టీవీవీపీ కమీషనర్ అజయ్ కుమార్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ భద్రాద్రి జిల్లాలోని టీవీవీపీ ఆసుపత్రులలో అద్భుతమైన సేవలు అందుతున్నాయని , జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో డీసీహెచ్ డాక్టర్ రవి బాబు, వివిధ ఆసుపత్రి సూపరిండెంట్ లు, వారి సిబ్బంది చాలా కష్టపడి పనిచేస్తూ జిల్లాకి రాష్ట్ర స్థాయిలో గొప్ప పేరు తెస్తున్నారని, ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని టీవీవీపీ కమీషనర్ డాక్టర్ అజయ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మెరుగైన సేవలకు కారణమైన వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తో కలిసి పాల్వంచలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఇటీవల చర్ల ఆసుపత్రిలో రెండు కిష్టమైన రోగులకు ఎంతో నేర్పుగా వైద్యం అందించి కోన ఊపిరితో ఉన్న నెలలు నిండని కవల పిల్లలు ఉన్న గర్భిణిని నార్మల్ డెలివరీ చేసి తల్లితో పాటు 1.1 కెజిల బరువుతో పుట్టిన ఇద్దరు ఆడ శిశువులను కాపాడటం అభినందనీయమన్నారు. కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులు సరిగా పనిచేయక 40 వేల తెల్ల రక్త కణాలు ఉండి కొన ఊపిరితో ఉన్న ఒక 70 ఏళ్ల వృద్ధుడికి నాణ్యమైన వైద్యం అందించి కాపాడిన విషయం పలు జాతీయ వార్త పత్రికల్లో కూడా రావడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల్లో సైతం అందుతున్న మెరుగైన వైద్య సదుపాయాలపై ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తు సంతృప్తి వ్యక్తం చేస్తూ, చర్ల సిబ్బందిని అభినందిస్తూ తన సందేశం తెలపాలని చెప్పారన్నారు. దీనిలో భాగంగానే తాను ప్రత్యేకంగా జిల్లాకు వచ్చినట్లు చెప్పారు. జిల్లాలో చర్లతోపాటు మణుగూరు, అశ్వారావుపేట, ఇల్లందు, భద్రాచలం ఆసుపత్రుల్లో సైతం అద్భుతమైన వైద్య సేవలు అందుతున్నాయని, డెలివరీల సంఖ్య బాగా పెరిగిందని, స్పెషలిస్ట్ వైద్యుల సేవలు జిల్లా నలుమూలల అందుబాటులో ఉండడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఆయన తెలిపారు. ఇటీవల వచ్చిన కేంద్ర బృదం సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ చర్లలాంటి ప్రాంతాల్లో అమోఘమైన వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ ఇతర ప్రాంతాల్లో సైతం మంచి సేవలు అందిస్తున్న సిబ్బందికి ప్రజల నుండి, ప్రజాప్రతినిధుల నుండి మంచి ఫీడబాక్ ఉందని తెలిపారు. ఆసుపత్రుల అవసరాలకి తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని సిబ్బందికి సూచించారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలు ఏజెన్సీ ప్రజలకు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు, జిల్లాలోని వివిధ ఆసుపత్రుల సూపరిండెంట్లు, వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## ఉచిత వైద్య శిబిరాన్ని కి మంచి స్పందన

వికారాబాద్:(ప్రజాస్ఫూర్తి) : వికారాబాద్ జిల్లా, నవాబుపేట మండలం, ఎక్ మామిడి గ్రామంలో ప్రజల ఆరోగ్య శ్రేయస్సును కాంక్షించి 'మా శారద ఆసుపత్రి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని (మెడికల్ క్యాంప్) కి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ నేతృత్వం వహించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఇంటి వద్దకే తీసుకురావాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది. డాక్టర్ కొప్పుల రాజశేఖర్ మరియు వారి ప్రత్యేక వైద్య బృందం గ్రామస్తులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత మరియు ఇతర సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం, సమస్యలు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరం ఏర్పాటులో గ్రామ పెద్దలు కీలక పాత్ర పోషించారు. గ్రామానికి చెందిన ప్రముఖులు యాదవరెడ్డి, రాఘవేందర్, ప్రవీణ్ రెడ్డి , మాజీ సర్పంచ్ దేవయ్య , స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శిబిరానికి కావలసిన అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం పట్ల వీరు శ్రద్ధ వహించి, వైద్య బృందానికి పూర్తి సహకారం అందించడం పట్ల డాక్టర్ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు చిన్నపాటి అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుంటే పెద్ద ముప్పును తప్పించవచ్చు. మా శారద ఆసుపత్రి ద్వారా పేదలకు వైద్య సేవలు అందించడం మాకు ఎంతో సంతృప్తిని ఇస్తుంది," అని పేర్కొన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ...

- **బృందావని కాలనీలో మార్మోగిన అయ్యప్ప భక్తి పాటలు**
- **అలరించిన ఆర్కెస్ట్రా బృందం పాటలు..**
- **పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట పట్టణంలోని బృందావని కాలనీలో గురువారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తులు బసవ సత్య ప్రకాష్ గుప్తా ఆధ్వర్యంలో వారి స్వగృహం వద్ద గురుస్వాములు గంగాధర శర్మ ఆధ్వర్యంలో గురు స్వామి దేవరశెట్టి సంతోష్ సమక్షంలో అయ్యప్ప మహా పడిపూజ కన్నుల పండువగ జరిగింది. ఈ మహా పడిపూజకు పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై మహా పడిపూజలో పాల్గొన్నారు. మహా పడిపూజలో భాగంగా స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాములు భక్తి పాటలు పాడారు. అయ్యప్ప స్వాములు పాడిన భక్తి పాటలు బృందావన కాలనీ అంతట మార్మోగాయి. ఆర్కెస్ట్రా బృందం అయ్యప్ప పాటలను అలరించారు. అయ్యప్ప నామస్మరణ, భక్తులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు బస్వ సత్య ప్రకాష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన మహా పడిపూజ అనంతరం స్వాముల ఆశీస్సులు పొందారు. అనంతరం అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎంపికైన తోట దేవిప్రసన్న శుక్రవారం హైదరాబాదులో పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఎంతో నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు మహేష్ కుమార్ గౌడ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ భద్రాద్రి డీసీసీ అధ్యక్షులు తోట దేవిప్రసన్న ను అభినందించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకుల్ని అందరిని కలుపుకొని వెళ్ళాలని, ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని, పార్టీని బూత్ స్థాయి నుంచి బలపర్చేందుకు కృషి చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా కార్యాచరణ తయారు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఆమె వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, కాంగ్రెస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్ ఉన్నారు.

## నేడు కూకట్ పల్లికి ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాక

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి మెట్రో మాల్ బ్యాక్ సైడ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్క్ వద్ద దయర్ గూడా గ్రామస్తులకు ఎస్సీ (మాల) కు సంబంధించిన 155 సర్వే నెంబరు స్థలంలో హుడా , హైడ్రా ఆర్టీవో వారు అక్రమంగా కబ్జాలకు రావడం జరిగింది. ఈ స్థలం హైకోర్టులో కేసు నడుస్తున్న అవేవీ పట్టించుకోకుండా దౌర్జన్యంగా దయర్ గూడా ఎస్ సీలని పోలీసులను పెట్టి బెదిరించి కంచ వేయడం జరిగింది . అట్టి విషయంపై ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు దయర్ గూడా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య వస్తున్నారు. కావున ప్రతి ఒక్కరు రావలసిందిగా కోరారు.

# తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన నాయకుడు మాజీ సీఎం కేసీఆర్



బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ ప్రాంత ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. దీక్షా దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న దీక్ష కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా సభా వేదికతో పాటు స్థానిక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన భోజన ఏర్పాట్లను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకై తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాల సాక్షిగా స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా బిఆర్ఎస్ అధినేత, పెద్దలు కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి మరీ పోరాడారని అన్నారు. వారి పోరాట పటిమను నేటి యువతరానికి తెలియజేసేలా ఈ దీక్ష దివాస్ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రతీ ప్రజాప్రతినిధి, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని దీక్షా దివాస్ ను విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు

* **అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు**
* **సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి, ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**
* **ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి , ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద విస్తృతంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితులను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ మద్యం, నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎవరూ కూడా రూ.50వేలకు మించి నగదు క్యారీ చేయవద్దని, ఎవరైనా అంతకు మించి డబ్బును ఎలాంటి రశీదు లేకుండా క్యారీ చేస్తే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రౌడీ షీటర్లు కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు దిగిన కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగేలా ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. వారి వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : చదువొక్కటే జీవితాలను మారుస్తుందని నమ్మిన మొట్టమొదటి సంస్కర్త మహాత్మా పూలే అని సిపిఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సిపిఎం కుత్బుల్లాపూర్ మండల్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం షాపూర్ నగర్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి కీలు కానీ లక్ష్మణ్ పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింది వర్గాల వారి జీవితాల్లో ఉన్నదంతా చీకటే. వాళ్ల ముందున్నది ఏ దారీ తెలియని కీకారణ్యమే.ఆ చీకట్లోనే,ఆ అడవిలోనే చేతిలో విద్య అనే జ్యోతిని పెట్టుకుని భవిష్యత్తరాల కోసం కొత్తదారిని నిర్మించాడు పూలే.తరువాత అంబేద్కర్ అదే దారిలో నడిచాడు.పూలే ఆశయాలను రాజ్యాంగబద్ధం చేసి ఈ దేశంలో తరతరాలుగా అణిచివేతలో ఉన్న ప్రజలకు అన్ని రకాల హక్కులను ప్రసాదించగలిగాడని అన్నారు. అత్యాధునిక కాలంలోనే స్త్రీలు హింసనూ, వివక్షను అనుభవిస్తుంటే పూలే కాలంనాటికి వాళ్ల పరిస్థితి ఎంతగా దిగజారిపోయి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. స్త్రీలు చదువుకోవటాన్ని ధర్మశాస్త్రాలు ఒప్పుకోవని, వారు చదువుకుంటే సమాజానికి కీడు దాపురిస్తుందని ఆనాటి పండితులు ప్రచారం చేసేవారు.అమాయకులైన ప్రజలు నమ్మేవారన్నారు. స్త్రీలతో పాటు శూద్రుల,అతిశూద్రుల పరిస్థితి కూడా ఇదే.చదువు లేకపోవటంవల్లనే పైన ఉన్న వర్గాలు ఈ ప్రజలను మోసం చేస్తున్నాయన్న సంగతిని తన జీవితానుభవాల ద్వారా పూలే గుర్తించాడు. అందుకే వారికి చదువు చెప్పి వాళ్లను చైతన్యం చేయాలనుకున్నాడు.ఈ దేశంలో. చదువుకు, జ్ఞానానికి ఉన్న సంబంధాన్ని ఆయన గుర్తించాడు. అందరితోపాటు తన చదువు విషయంలోనూ బ్రాహ్మణవర్గం ఎట్లా కుట్రలు చేసిందో ఆయనకు తెలుసు కున్నారు అందుకే బ్రాహ్మణ వర్గం ఒకటే ఉన్నతంగా జీవిస్తూ మిగిలిన వర్గాలు అణగారిపోవటానికి దారితీస్తున్న ఇతర కారణాల గురించి ఆలోచించాడు కుటుంబం మారాలంటే స్త్రీ చదువు కోవాలని భావించిన పూలే 1848లో మొట్టమొదటి అతిశూద్ర బాలికల పాఠశాల ప్రారంభించాడు.ఆ రోజుల్లో ఆడవాళ్లు చదువుకోవడం నిషిద్ధం కాబట్టి మహిళా ఉపాధ్యాయులు అందుబాటులో లేరు. ఈ కారణంగా మొదట తన భార్య సావిత్రిభాయికి చదువు నేర్పి ఆమెతో ఆడపిల్లలకు చదువు చెప్పించాడు. ఆ రకంగా ఈ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రీభాయి పూలే నిలిచిందినిజానికి ఉపాధ్యాయ దినోత్సవం సావిత్రీ భాయి పేరు మీద జరగాలి. కానీ, అగ్రవర్ణ భావజాలం గల మన నాయకులు ఆమె సేవలను గుర్తించలేదు. ఇలాంటి కుట్రలు స్వయంగా ఆమె కార్యరంగంలో ఉన్నప్పుడు కూడా చేసారు. ఆమె చదువుచెప్పటానికి పాఠశాలకు వెళ్తుంటే ఓర్వలేని పండితులు ఆమె మీద పేడనీళ్లు చల్లి తిట్టేవారు, చంపుతామని బెదిరించేవారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పసుల అంజయ్య దేవదానం. కరుణాకర్ శీను. యాదవ రెడ్డి నర్సింలు. మల్లారెడ్డి సాధులు. భాష. వీరేష్ తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థుల ను తగు రీతి లో ప్రోత్సహించి దేశానికి మంచి శాస్త్రవేత్తలను అందజేయాలి

* **మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయ కుమారి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి ) : విద్యార్థులలో రీసెర్చ్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఉపాధ్యాయులు వారిని తగు రీతి లో ప్రోత్సహించి భవిష్యత్తులో మన దేశానికి మంచి శాస్త్రవేత్తలను అందజేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయ కుమారి అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్థాయి ఇన్స్పైర్ ఎగ్జిబిషన్ 2025 26, బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లా స్థాయి ప్రాజెక్టుల పోటీ కి సంబంధించిన రెండు రోజుల వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా విద్యాశాఖ అధికారిణి ఐ. విజయ కుమారి సూరారం లోని సీఎంఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల నుంచి 159 ఇన్స్పైర్ 105 రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ఎగ్జిబిట్స్, 22 టీచర్స్, టీఎల్ఎం ప్రాజెక్టు, వెల్త్ ఫ్రమ్ వేస్ట్ ఎన్జీసీ లో 5 ప్రాజెక్టులు ప్రదర్శించ బడుతున్నాయి, ప్రదర్శనలో పాల్గొంటున్న విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం అనే అంశం పైన సెమినార్ నిర్వహించారు అని జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయ కుమారి మాట్లాడుతూ నిత్య జీవితంలో మనం వినియోగించే ప్రతి వస్తువు కూడా ఎవరో ఒక శాస్త్రవేత్త కను గొన్నదే . వారు చేసిన ప్రయత్నం



మూలంగానే మనం ఈరోజు సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నాం అని విద్యార్థులకు తెలియజేస్తూ వారు కూడా భావితరాలకు అవసరమయ్యే వాటిని సమాజానికి అందజేయాలని తెలియజేశారు. న్యాయనిర్ణేతల ముందు తమ ప్రాజెక్టు గురించి భయం లేకుండా వివరించాలని తద్వారా రాష్ట్ర స్థాయికి ఎక్కువ ప్రాజెక్టులు వెళ్లాలని పిల్లలకి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి జిల్లా సైన్స్ ఆఫీసర్ తో పాటు కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖ అధికారిణి జెమినీ కుమారి, జిల్లాలోని వివిధ మండలాల మండల విద్యాశాఖ అధికారులు, స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ నాగ జ్యోతి, వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన సైన్స్ ఉపాధ్యాయులు, స్టూడెంట్స్ , వివిధ జిల్లా స్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తా

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయిస్తానని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్ట్ సంఘాల నాయకులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు జర్నలిస్టుల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.. దొమ్మర పోచంపల్లి పరిధిలో ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న సంబంధిత శాఖ మంత్రితో సైతం ఈ విషయం పై చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. సూరారం లో నిర్మించ తలపెట్టిన ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత తనదేనని, ఇప్పటికే కొంత శాతం నిర్మాణం జరిగిందని, మరో 10 లక్షలతో వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. భవన నిర్మాణానికి అవసరమైతే మరో 20 లక్షలు తాను సొంతంగా ఇచ్చి పూర్తి చేస్తానని అన్నారు. అట్టి భవనానికి తన తండ్రి పేరు అయిన కూన మాణిక్యం పాండు జర్నలిస్ట్ భవన్ గా ఇక్కడి జర్నలిస్టులకు అందిస్తానని వివరించారు. స్థానికంగా ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సైతం మాట్లాడి జర్నలిస్టులకు వైద్య సహాయం అందే దిశగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్,టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్ ,టి ఎస్ యూ డబ్ల్యూ జె నాయకులు గుంటూరు శేఖర్, కసుకుర్తి వెంకట్ , టి యు డబ్ల్యూ జె నాయకులు రంగు వెంకటేష్ గౌడ్, కొలిపాక వెంకట్ , ఉద్దండపురం వెంకటేష్ గౌడ్, శివాజీ, కుంట అనిల్ కుమార్,ఫెడరేషన్ నాయకులు దామెర జగదీశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# వెండి నగల వెలుగులివి...

పసిడి నగలంటే ఇష్టపడని అమ్మాయిలుంటారా? కానీ, బంగారమేమో రోజు రోజుకీ కొండెక్కి కూర్చుంటోంది. సామాన్యులకు అందకుండా పరుగెడుతోంది. దీంతో అమ్మాయిల మనసు దోచుకునేందుకు ఇదే మంచి సమయం అనుకుంటూ... వెండి నగలు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. వీటికి విలువా పెరిగింది. హాల్‌మార్క్ ముద్రా పడుతోంది. ప్యూర్, స్టెర్లింగ్, కోటెడ్, ప్లేటెడ్... అంటూ వెండిలోనూ ఎన్నోరకాలు. కొన్ని పసిడి పూత వేసుకునీ మెప్పిస్తున్నాయి. ఈ నగల్లో జెన్‌జీలు మెచ్చే మినిమలిస్ట్ డిజైన్లతో పాటు నవవధువుల్నీ, వారి బంధుగణాన్నీ ఆకట్టుకునేలా వజ్రాలు, కెంపులు, పచ్చలు... వంటి నవరత్నాలను చేర్చి ఆకట్టుకుంటున్నారు. ఇవి సంప్రదాయ వస్త్రధారణ మీదకే కాదు, ఆధునిక శైలి దుస్తులకూ నప్పేస్తున్నాయి. చూస్తే మీకూ నచ్చేస్తాయి.

















# విద్యార్థులకు కల్తీ ఆహారం.. ఎంత మందిని జైలుకు పంపారు?: హరీశ్‌రావు

హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు అని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ముందు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యాశాఖపై




ఇక నుంచి తానే సమీక్షలు చేస్తానని, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకే అన్న బెదిరింపులేమయ్యాయని ప్రశ్నించారు. రెండేళ్లుగా తన వద్దే ఉన్న విద్యాశాఖపై ముఖ్యమంత్రి ఎన్ని సార్లు సమీక్షలు చేశారు? విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న ఎంత మందిని జైలుకు పంపారని నిలదీశారు. ముఖ్యమంత్రి మాటలకు విలువ లేదు, ఆచరణకు దిక్కులేదని విమర్శించారు. బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులు.. పురుగులన్నం వద్దని రోడ్డెక్కి నిలదీస్తుంటే ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రిగా.. సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్కీమ్‌లు లేవు గానీ.. ఎందులో చూసినా స్కామ్‌లేనని హరీశ్ రావు మండిపడ్డారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు పురుగులన్నం పెట్టిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# రెండో రోజు సర్పంచి పదవులకు 4,901 నామినేషన్లు

హైదరాబాద్: తెలంగాణలో మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం.. సర్పంచి పదవులకు 4901 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు రోజులకు కలిపి సర్పంచి స్థానాల కోసం 8,198 నామినేషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు. నిన్న, ఇవాళ కలిపి వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు అందినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 4,236 సర్పంచి, 37,440 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు రేపటితో గడువు ముగియనుంది.

# కాళోజీ వర్సిటీ.. వీసీ డా.నందకుమార్ రాజీనామా

హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డా.నందకుమార్ రాజీనామా చేశారు. వర్సిటీ వ్యవహారాలకు సంబంధించి ఇటీవల ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. మూల్యాంకనంలో అక్రమాలు, ఇష్టారీతిగా ఇన్‌ఛార్జ్‌ల నియామకం తదితర ఆరోపణల నేపథ్యంలో సీఎం ఆరా తీశారు. ఈ క్రమంలో నందకుమార్ రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.



# వేధింపులు తాళలేక.. భర్తను అంతమొందించిన భార్య

ఘట్‌కేసర్ (హైదరాబాద్): రోజూ మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను.. భార్య అంతమొందించింది. కుమారుడు, మరొకరితో కలిసి మెడకు టవల్ బిగించి హత్య చేసిన ఘటన మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ దేవేందర్‌నగర్‌కు చెందిన బండారు అంజయ్య (55) ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్. అతనికి భార్య ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిత్యం మద్యం తాగివచ్చి భార్య, పిల్లలను వేధింపులకు గురి చేస్తున్నాడు. గురువారం రాత్రి భార్య బుగమ్మ, కుమారుడు రాజు, బంధువు శేఖర్‌తో కలిసి అంజయ్య మద్యం తాగారు. అర్ధరాత్రి భార్య, కుమారుడు, బంధువు కలిసి అంజయ్య మెడకు టవల్ బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన అంజయ్య కుమార్తెను గదిలో బంధించారు. జరిగిన విషయం కుమార్తె చెప్పడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది

**: భాజపా ఎంపీ ఈటల**



కమలాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పూర్తి వ్యతిరేకత ఉందని.. ఇక, భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచే అవకాశమే లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. ''గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే భాజపాతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సరిగా చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సర్వర్లు పని చేయక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. బీసీ రిజర్వేషన్లపై డ్రామాలాడింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు''అని ఎంపీ ఈటల తెలిపారు.

# జర్మనీ దేశ అధికార.. ఎస్‌డీపీ ప్రతినిధుల బృందంతో స్పీకర్ గడ్డం ప్రసాద్

జర్మనీ దేశ అధికార సోషల్ డెమొక్రటిక్ పార్టీ (ఎస్‌డీపీ ) ప్రతినిధుల బృందం రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో శుక్రంవారం భేటీ అయ్యారు. రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన జర్మనీ ఎస్‌డీపీ సెక్రటరీ జనరల్ సబీనా ఫెండరీచ్, ఆసియా పసిఫిక్ హెడ్ మైక్రో గుంథర్, ఇండియా డైరెక్టర్ క్రిస్టోఫ్ పిమోర్‌లు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులు, అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో సమావేశం అయ్యారు. రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా జర్మనీ బృంద సభ్యులను పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందున్నదని జర్మన్ ప్రతినిధులకు వివరించారు.

# తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకం

హైదరాబాద్: తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ వాడుకున్నారని, ఇప్పుడు దీక్షా దివస్ పేరుతో మరోసారి సెంటిమెంట్ రాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకమన్నారు. ''కేసీఆర్ మూడు రోజులకే దీక్ష ముగించి పలాయనం చిత్తగించారు. దీక్షను మధ్యలోనే విరమిస్తే విద్యార్థి సంఘాల



నుంచి వ్యతిరేకత వచ్చింది. కేవలం కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదు. కాంగ్రెస్ వల్ల తెలంగాణ వచ్చింది. పొట్టి శ్రీరాములు చేసిన దీక్షకు.. కేసీఆర్ దీక్షకు పొంతన లేదు. ఉద్యమంలో పాల్గొన్న పేదలు, విద్యార్థులు, ఎస్సీలు, ఎస్టీలు ఆత్మార్పణం చేసుకున్నారు. వారి త్యాగాల వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైంది''అని మహేశ్‌కుమార్ అన్నారు.

# రైలుపట్టాలపై బైఠాయించిన కవిత.. అడ్డుకున్న పోలీసులు

కామారెడ్డి: కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన



చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. అంతకుముందు కామారెడ్డిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరం ద్వారా కామారెడ్డి జిల్లాకు ఒక్క ఎకరాకూ నీళ్లు రాలేదని విమర్శించారు. ప్యాకేజీ 21, 22 ద్వారా డబ్బులన్నీ కాంట్రాక్టర్లకే పోయాయన్నారు. ప్రజలకు మేలు జరగలేదని చెప్పారు. ఈ విషయం చెబితే భారత రాష్ట్ర సమితి వాళ్లు తన మీద నోరు వేసుకొని పడిపోతారని దుయ్యబట్టారు. తనపై కుట్ర చేసి కుటుంబం నుంచి దూరం చేశారన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో మొదటి ద్రోహి భాజపా, రెండో ద్రోహి కాంగ్రెస్ అని మండిపడ్డారు.

# పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.



# జనవరి 1న ఆయుధాలు విడిచి లొంగిపోతాం: మావోయిస్టులు



భద్రాచలం: మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఎంఎంసీ (మహారాష్ట్రమధ్యప్రదేశ్ ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.

# మీ వల్లే హైడ్రా మీద ప్రజలకు భరోసా

# ఎంఈటీలకు రంగనాథ్ అభినందనలు

'వర్షం ఎంత పడినా హైడ్రా ఉందనే భరోసా నగర ప్రజలకు ఇచ్చారు. భారీ వర్షాలు పడినా వరదలు ముంచెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిత్యం క్యాచ్‌పిట్లు, కల్వర్టులతో పాటు.. నాలాల్లో పూడిక తీసి వరద సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు' అని మాన్సూన్ ఎమర్జన్సీ, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలను హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ అభినందించారు. వర్షాకాలంలో పని చేసే మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌ల కాలపరిమితి 150 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జలవిహార్ లో ఏర్పాటు చేసిన అభినందన సభలో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ మాట్లాడారు. '5 నెలల క్రితం ఇక్కడే సమావేశమై.. మాన్సూన్ విధుల గురించి వివరించాం. నిర్దేశించిన దానికంటే ఎక్కువ పని చేసి హైడ్రాతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చారు. వర్షాల వేళ ముప్పు ప్రాంతాల్లో సేవలందిస్తూ ప్రజల ప్రశంసలు అందుకున్నారు. సమస్య పరిష్కారం వరకే పరిమితం అవ్వకుండా.. ఆ సమస్యకు కారణాలను కూడా తెలుసుకుని పని చేసిన తీరు అభినందనీయం'అని హైడ్రా కమిషనర్ అన్నారు.

**కుంభవృష్టి వానలు కురిసినా..**

హైడ్రాలో భాగమైన డిజాస్టర్ రెస్పాన్స్ సిబ్బంది, ఎస్ ఎఫ్ వోలు, మార్షల్స్‌తో కలసి మెట్ టీమ్‌లు ఎంతో నిబద్ధతతో పని చేశాయని హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ అభినందించారు. ఇలా 3 వేల లారీల పూడికను నాలాల నుంచి తొలగించి వరద సాఫీగా సాగేలా రేయింబవళ్లు పని చేసిన తీరు



నగర ప్రజలు గమనించారన్నారు. వర్షాలు వస్తున్న వేళ.. వరద భయం లేకుండా నగర ప్రజలు ప్రయాణాలు సాఫీగా సాగించారు. కాలనీలు నీట మునగకుండా ముందస్తు జాగ్రత్తలో వరద ముప్పు లేకుండా చేశారంటూ హైడ్రా కమిషనర్ మెట్ టీమ్‌లను కొనియాడారు. వాతావరణ పరిస్థితుల వల్ల క్లౌడ్‌బరస్ట్‌లు చాలాసార్లు సంభవించాయి.

# అంగారక గ్రహంపై పలు బిలాలకు కేరళలోని పట్టణాల పేర్లు

ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ యూనియన్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అంగారక గ్రహంపై ఉన్న బిలాలకు కేరళలోని పలు పట్టణాల పేర్లు పెట్టేందుకు ఆమోదం తెలిపింది. అంగారక గ్రహంలోని క్సాంతే టెర్రా ప్రాంతంలో 3.5 బిలియన్ సంవత్సరాల నాటి బిలాలను కనుగొన్నారు. వీటికి భారత భూవిజ్ఞాన శాస్త్రవేత్త ఎంఎస్ కృష్ణన్ గౌరవార్థం ఆయన పేరు పెట్టాలని కేరళ ఖగోళ పరిశోధకులు ఆసిఫ్ ఇక్బాల్ కక్కస్సేరి, రాజేశ్ వి.జె.లు ప్రతిపాదించారు. మరికొన్నింటికి కేరళకు చెందిన పెరియార్, వలియామల, తుంబ, వర్కల, బెకల్ తదితర పట్టణాల పేర్లను ప్రతిపాదించారు. వీటికి తాజాగా ఐఏయూ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం బిలాల్లోని నీరు, మంచుజాడలు కన్పించిన వాటిని ఇకనుంచి కృష్ణన్ క్రేటర్, కృష్ణన్ పాలస్, పెరియార్ వల్లిస్ అని పిలుస్తారు. మిగిలినవాటికి.. వలియామల (ఐఐఎస్‌టీ ప్రధాన కార్యాలయం), తుంబా (1960లో ఇస్రో స్థాపించిన స్థలం), వర్కల (ప్రత్యేకమైన కొండలు),




బెకల్ (చారిత్రాత్మక కోట), పెరియార్ (కేరళలో అతి పొడవైన నది)గా వ్యవహరిస్తారు. ఎంఎస్ కృష్ణన్ 1898లో తంజావురులో జన్మించారు. జియోలాజికల్ సర్వేఆఫ్ ఇండియాకు తొలి డైరెక్టర్‌గా ఉన్నారు. ఇక, గతేడాది అంగారక గ్రహంపై మూడు బిలాలను కనుగొన్నారు. వాటిల్లో ఒకదానికి దివంగత, ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త దేవేంద్రలాల్ పేరు పెట్టారు. మిగిలినవాటికి ఉత్తర్ ప్రదేశ్‌లోని ముర్సాన్ పట్టణం, బిహార్‌లోని హిల్సా టౌన్ పేర్లను పెట్టారు.

## అప్పటికల్లా నక్సలిజం నుంచి
# పూర్తి విముక్తి: అమిత్ షా

ఢిల్లీ: నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. తదుపరి జరగబోయే డీజీపీలు, ఐజీపీల సదస్సు నాటికి దేశం ఈ సమస్య నుంచి పూర్తిగా విముక్తి పొందుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల సమస్యలు, జమ్మూకశ్మీర్ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విజయం సాధించిందని అన్నారు. రాయ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన డీజీపీ, ఐజీపీల వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశ భద్రత, అంతర్గత శాంతిని కాపాడటంలో పోలీస్ దళాల పాత్ర కీలకమని అమిత్ షా ఉద్ఘాటించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు, నేరగాళ్లకు భారతదేశంలో ఎంతమాత్రం స్థానంలేదని హెచ్చరించారు. పాపులర్ ఫ్రంట్



ఆఫ్ ఇండియా పై నిషేధం తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ఆ తర్వాత జరిగిన పరిణామాలను అమిత్ షా ప్రస్తావించారు. పీఎఫ్ఐ నిషేధం తర్వాత దేశవ్యాప్తంగా అధికారుల సోదాలు, అరెస్టులు చేయడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ చర్యలు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శించాయని, ఇది దేశ భద్రతా చర్యలకు ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు.

# కర్ణాటకలో సీఎం మార్పు ఊహాగానాలు..
## సోనియా గాంధీని ప్రస్తావించిన డీకేఎస్

బెంగళూరు: కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు రోజురోజుకీ మరింత వేడెక్కుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య పరోక్ష మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న డీకేఎస్.. 'సోనియా గాంధీ అధికారాన్ని త్యాగం చేశారు' అని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ విజయం సాధించినప్పటికీ.. ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని సోనియా గాంధీ వదులుకున్నారని డీకేఎస్ వ్యాఖ్యానించారు. ఆ అవకాశాన్ని ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్‌కు ఇచ్చారని గుర్తుచేశారు. కర్ణాటకలో



కాంగ్రెస్ పార్టీ రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2023లో అధికారంలోకి వచ్చిన సమయంలో సీఎం సిద్ధరామయ్య, డీకేఎస్ మధ్య అధికార పంపిణీకి ఒప్పందం కుదిరిందనే చర్చ జరుగుతోంది. దీంతో శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించాలని ఆయన వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ తరుణంలో తాజాగా డీకేఎస్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అంతకుముందు తమ మధ్య ఐక్యత ఉందని అర్థం వచ్చేలా ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోను శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇక గురువారం ఇరువురి మధ్య 'వర్డ్ వార్' కొనసాగింది. ఇచ్చిన 'మాట' నిలబెట్టుకోవాలని డీకే పరోక్షంగా పోస్ట్ చేయగా.. ప్రజలు ఐదేళ్లు పాలించేందుకు తీర్పు ఇచ్చారని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యతో పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు.

*** బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించా: సిద్ధరామయ్య**

డీకే శివకుమార్‌ను సిద్ధరామయ్య అల్పాహారానికి ఆహ్వానించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు శనివారం తాము సమావేశం కానున్నట్లు సీఎం తెలిపారు. తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉంటానన్నారు. హైకమాండ్ పిలిస్తే ఢిల్లీకి వెళ్లడానికి కూడా తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

## పేదల కోసం అర్ధరాత్రి వరకూ
# కోర్టులో ఉంటా: సీజేఐ

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. పేద కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడటం తన తొలి ప్రాధాన్యమన్న ఆయన.. అవసరమైతే, వారి కోసం అర్ధరాత్రి వరకూ న్యాయస్థానంలో కూర్చుంటానని అన్నారు. తిలక్ సింగ్ డాంగి అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వంతోపాటు ఇతరులపై దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా సీజేఐ ఈ విధంగా స్పందించారు. తన కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు ఉండవని, ఇటువంటి కేసులను సంపన్నులు వేస్తున్నారని ఈ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు. హరియాణా హిసార్ జిల్లాలోని మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన జస్టిస్ సూర్యకాంత్..



భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 24న బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. దాదాపు 15 నెలలపాటు ఈ పదవిలో ఉండనున్నారు. 2027 ఫిబ్రవరి 9న సీజేఐ పదవీ విరమణ చేస్తారు.

# భారత న్యాయనిపుణుడికి అరుదైన గౌరవం..
## 'ఇజ్రాయెల్‌పాలస్తీనా' కమిషన్‌కు నేతృత్వం

ఒడిశా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇజ్రాయెల్‌పాలస్తీనా వివాదంలో మానవహక్కుల ఉల్లంఘనపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన కీలక ప్యానెల్‌కు ఆయన నేతృత్వం వహించనున్నారు. ఇజ్రాయెల్ గాజా ఉద్రిక్తతలను ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన ఒక మానవ హక్కుల బృందానికి భారతీయ న్యాయమూర్తి నేతృత్వం వహించడం విశేషం. ఇజ్రాయెల్, 'ఆక్రమిత పాలస్తీనా ప్రాంతం'లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరపడం ఈ ప్యానెల్ ప్రధాన బాధ్యత. ఈ స్వతంత్ర అంతర్జాతీయ విచారణా కమిషన్‌కు గతంలో బ్రెజిల్ న్యాయనిపుణుడు పాలో సెర్గియో పిన్హీరో నేతృత్వం వహించారు. ఇజ్రాయెల్‌పాలస్తీనా సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న వేళ జస్టిస్ మురళీధర్ ఇవ్వబోయే నివేదికలకు చాలా ప్రాధాన్యం ఉండనుంది.



**ఎవరీ జస్టిస్ ఎస్.మురళీధర్?**

కీలక తీర్పులు, ప్రగతిశీల ఆలోచనలతో జస్టిస్ మురళీధర్ గుర్తింపు పొందారు. 1984లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత ఢిల్లీ హైకోర్టుకు మారారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌లోనూ సేవలు అందించారు. 2006లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021లో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. స్వలింగ సంపర్కం నేరం కాదని ప్రకటించడం ఆయన ఇచ్చిన తీర్పుల్లో ముఖ్యమైంది. అయితే, 2013లో సుప్రీంకోర్టు దీన్ని రద్దు చేసింది. 2023లో పదవీ విరమణ చేసిన తర్వాత మురళీధర్ మళ్లీ న్యాయవాద వృత్తిని చేపట్టారు.

## ఢిల్లీ పేలుడు ఉగ్ర కుట్ర సీన్ రీక్రియేషన్..
# అల్-ఫలాకు డాక్టర్ షాహిన్

ఢిల్లీ పేలుడు కేసు లో జాతీయ దర్యాప్తు సంస్థ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్‌ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. అల్‌ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో



మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్‌ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాదన్నారు. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్‌ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

# ఒంటిపై 3.5 కిలోల బంగారం.. ఎవరీ కన్హయ్యలాల్?

రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్‌కు చెందిన వ్యాపారి కన్హయ్యలాల్ ఖటిక్‌కు బెదిరింపులు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ రోహిత్ గొడారా పేరుతో ఫోన్ కాల్స్, ఆడియో మెసేజ్‌లు వస్తున్నాయని, రూ.5 కోట్లు డిమాండ్ చేసినట్లు కన్హయ్యలాల్ ఆరోపించాడు. లేదంటే బంగారు ధరించకుండా చేస్తామని హెచ్చరిస్తున్నట్లు వాపోయాడు. ఇదే విషయంపై స్థానిక కొత్వాలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో గతంలో తోపుడు బండిపై కూరగాయలు విక్రయించి.. స్థానికంగా గోల్డ్‌మ్యాన్‌గా పేరొందిన కన్హయ్యలాల్ మరోసారి వార్తల్లో నిలిచాడు.

**ఎవరీ కన్హయ్యలాల్?**

చిత్తోడ్‌గఢ్‌కు చెందిన కన్హయ్యలాల్ ఖటిక్ (50) పండ్ల వ్యాపారి. బంగారం అంటే పిచ్చి. పండ్ల వ్యాపారంలోకి రాకముందు.. దాదాపు 25ఏళ్ల క్రితం తోపుడు బండిపై కూరగాయలు విక్రయించేవాడు. కశ్మీర్ నుంచి యాపిల్ పండ్లను తీసుకువచ్చి స్థానికంగా అమ్మడం



మొదలుపెట్టిన తర్వాత అతడి దశ తిరిగిపోయింది. వ్యాపారం వృద్ధి చెందడంతో సంపాదన పెరిగింది. బంగారమంటే మక్కువ. చైన్లు, ఉంగరాలు, ఇతర ఆభరణాలు కలిపి మూడున్నర కిలోల వరకు ధరించి తిరుగుతుంటాడు. వ్యక్తిగత భద్రత కూడా ఏమీ ఉండదు. మ్యూజిక్ డైరెక్టర్ 'బప్పీ లహిరి' అంటే ఇష్టం. ఆయన మాదిరిగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటాడు. గతంలో ఓ మిత్రుడు ఇచ్చిన 20 గ్రాముల చైన్‌తో మొదలై.. నగరంలో గోల్డ్‌మ్యాన్‌గా పేరు తెచ్చుకొనే స్థాయికి ఎదిగాడు. ఈ క్రమంలోనే తాజాగా అతడికి బెదిరింపులు వచ్చాయి. డబ్బు ఇవ్వకుంటే ఒంటిపై బంగారం వేసుకోకుండా చేస్తామని హెచ్చరికలు రావడంతో స్థానిక పోలీసులను ఆశ్రయించాడు.

## బిడ్డ కావాలంటూ బలవంతం చేశాడు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేపై మహిళ రేప్ కేసు

కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌పై అత్యాచారం కేసు నమోదైంది. రాహుల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని.. అనంతరం గర్భాన్ని తొలగించుకోవాలని బెదిరించాడని కేరళకు చెందిన ఓ యువతి సీఎం పినరయ్ విజయన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. ఆ ఫిర్యాదులో తాము కొంతకాలం కలిసున్నామని.. తనకు బిడ్డ కావాలని బలవంతం చేసి, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ చేయించుకోవాలని రాహుల్ బెదిరింపులకు పాల్పడ్డాడని యువతి పేర్కొంది. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డ్‌లు, వాట్సప్ స్క్రీన్‌షాట్‌ల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, దీనిపై ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్ స్పందిస్తూ.. తాను ఏ తప్పూ చేయలేదన్నారు. కుట్రపూరితంగా తనపై కేసు నమోదు చేశారని, దీనిని చట్టపరంగా ఎదుర్కొంటానన్నారు. ప్రజలు, న్యాయస్థానం ముందు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానన్నారు.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు...

## స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ
## రోజంతా పరిమిత శ్రేణిలోనే సాగిన ట్రేడింగ్
## కీలక స్థాయిల వద్ద నిఫ్టీకి నిరోధం
## మిశ్రమంగా స్పందించిన రంగాల వారీ సూచీలు




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఫ్లాట్‌గా ముగిశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో రోజంతా సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 13.71 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 85,706.67 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 12.6 పాయింట్లు క్షీణించి 26,202.95 వద్ద ముగిసింది.

రోజంతా నిఫ్టీ 26,190 నుంచి 26,281 పాయింట్ల మధ్యే ట్రేడ్ అయింది. 26,281 స్థాయి వద్ద నిఫ్టీకి బలమైన నిరోధం ఎదురైందని విశ్లేషకులు తెలిపారు. 26,150-26,000 స్థాయిలు కీలక మద్దతుగా ఉన్నంతవరకు మార్కెట్ ధోరణి స్థిరంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. 26,280-26,310 శ్రేణిని దాటితేనే మార్కెట్‌లో స్పష్టమైన దిశానిర్దేశం ఉంటుందని వివరించారు.

సెన్సెక్స్ షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, సన్ ఫార్మా, మహీంద్రా మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. మరోవైపు, పవర్ గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయి సూచీలపై ఒత్తిడి పెంచాయి.

రంగాల వారీగా మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ ఐటీ, రియల్టీ, ఆయిల్ గ్యాస్ సూచీలు 0.69 శాతం వరకు నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఆటో 0.62 శాతం, నిఫ్టీ ఫార్మా 0.59 శాతం మేర లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.11 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.27 శాతం చొప్పున నష్టపోయాయి.

అమెరికా బాండ్ లాభాలు తగ్గడం, దేశీయ సంస్థాగత మదుపరుల నుంచి కొనుగోళ్ల మద్దతు కొనసాగడం సానుకూలంగా ఉన్నప్పటికీ, రూపాయి విలువలో అస్థిరత, కొన్ని బ్యాంకు కౌంటర్లలో లాభాల స్వీకరణ కారణంగా ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# ముఖేశ్ అంబానీ కంపెనీకి భారీ పెనాల్టీ..

## రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రూ.56.44 కోట్ల జరిమానా
## అహ్మదాబాద్ జీఎస్టీ శాఖ నుంచి పెనాల్టీ ఉత్తర్వులు
## ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను బ్లాక్ చేయడంతో వివాదం
## ఈ నిర్ణయంపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు తెలిపిన రిలయన్స్




**ముంబై:** దేశంలోని దిగ్గజ పారిశ్రామిక సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అహ్మదాబాద్‌లోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్, కంపెనీకి రూ.56.44 కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో ఈ పెనాల్టీ విధించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పీల్‌కు వెళ్లనున్నట్లు రిలయన్స్ స్పష్టం చేసింది.

ఈ మేరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ నెల 25న జారీ అయిన ఈ ఉత్తర్వులు, తమకు గురువారం ఉదయం 11:04 గంటలకు ఈ-మెయిల్ ద్వారా అందాయని కంపెనీ తెలిపింది. సెంట్రల్ జీఎస్టీ చట్టం, 2017లోని సెక్షన్ 74 కింద ఈ జరిమానా విధించారు.

అయితే, జీఎస్టీ అధికారుల నిర్ణయాన్ని రిలయన్స్ తప్పుబట్టింది. సేవల ప్రదాత (సర్వీస్ ప్రొవైడర్) అందించిన సేవల వర్గీకరణను పరిగణనలోకి తీసుకోకుండానే, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను బ్లాక్డ్ క్రెడిట్‌గా పరిగణించి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించింది. అందుకే ఈ ఉత్తర్వులపై అప్పీల్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వివరించింది.

# ఆరు త్రైమాసికాల గరిష్ఠానికి జీడీపీ..

## క్యూ2లో 8.2%




**న్యూఢిల్లీ:** భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో మెరుగైన జీడీపీ గణాంకాలను నమోదు చేసింది. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదైంది. ఆరు త్రైమాసికాల గరిష్ఠానికి చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 5.6 శాతంగా నమోదు కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. ప్రైవేటు మూలధన వ్యయం అంతంతమాత్రంగానే ఉన్నా.. గ్రామీణ స్థాయిలో వినియోగం పెరగడం, ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల జీడీపీ వృద్ధిలో కీలక భూమిక పోషించాయి.

పండగ సీజన్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ హేతుబద్ధీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 22న తగ్గించిన జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయి. దీనికితోడు పండగ సీజన్ కొనుగోళ్లు కలిసొచ్చి దేశీయంగా వినియోగం పెరిగి వృద్ధికి ఊతం లభిస్తుందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. కానీ, జీఎస్టీ రేట్ల ప్రభావం పూర్తిగా కనిపించకముందే.. మెరుగైన జీడీపీ గణాంకాలు నమోదుకావడం గమనార్హం. ముఖ్యంగా జీడీపీలో 14 శాతం వాటా కలిగిన తయారీ రంగం 9.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతేడాది ఈ వృద్ధి 2.2 శాతంగా ఉంది.

# కరీంనగర్ టు టీమిండియా..

## ఇప్పుడు డబ్ల్యూపీఎల్ వేలంలో రూ.2.40కోట్లు..!

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ మెగా వేలంలో సీనియర్లు కోట్లు కొల్లగొట్టారు. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రూ.3.20 కోట్లతో రికార్డు నెలకొల్పగా.. వెటరన్ పేసర్ శిఖా పాండే సైతం భారీ ధర పలికింది. టీ20ల్లో అనుభవజ్ఞురాలైన ఈ స్పీడ్‌స్టర్ కోసం ఆర్సీబీ, యూపీ వారియర్స్ పోటీపడ్డాయి. కానీ, చివరకు యూపీ రూ.2.40 కోట్లు భారీ ధరకు కొనేసింది. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అనే నానుడికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది శిఖా. ఇంతకూ ఈ మీడియం పేసర్ పుట్టింది మన కరీంనగర్‌లో. డబ్ల్యూపీఎల్ వేలంలో ఎవరూ ఊహించని విధంగా శిఖా పాండే భారీ ధర పలికింది. దీప్తి శర్మ తర్వాత అత్యధిక ప్రైజ్ పట్టేసిన భారత క్రికెటర్ ఆమెనే. ఈ మెగా టోర్నీలో మూడు సీజన్లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన శిఖా కోసం వేలంలో ఫ్రాంచైజీల మధ్య టగ్ ఆఫ్ వార్ నడించింది. విదేశీ లీగ్స్(బిగ్‌బాష్ లీగ్, కరీబియన్ ప్రీమియర్ లీగ్, విమెన్స్ సూపర్ స్మాష్)లో ఆడుతూ మంచి ఫామ్‌లో ఉన్న ఆమెను చివరకు యూపీ వారియర్స్ రూ.2.40 కోట్లకు దక్కించుకుంది. నాలుగో సీజన్‌లో కొత్త జట్టుకు ఆడడంపై శిఖా సంతోషం వ్యక్తం చేసింది.

'వేలం గురించి నిన్నటి నుంచి ఆసక్తిగా ఎదురుచూశా. అయితే.. ఏం జరిగితే అది జరుగుతుందని మనసుకు సర్ది చెప్పాను. గత మూడు సీజన్లు నేను చాలా కష్టపడ్డాను. ఇప్పుడు యూపీ వారియర్స్ ఫ్యామిలీలో చేరుతున్నందుకు సంతోషంగా ఉంది. కొత్తటీమ్‌కు ఆడనుండడం కచ్చితంగా సరికొత్త ఫీలింగ్. డబ్ల్యూపీఎల్‌లో మూడేళ్లు నాకు అవకాశం కల్పించిన ఢిల్లీ ఫ్రాంచైజీకి కృతజ్ఞతలు. ఇక యూపీలోని చాలామందితో నేను కలిసి ఆడాను. మేగ్ లానింగ్‌కు కెప్టెన్సీ ఇస్తారని అనుకుంటున్నా' అని 36 ఏళ్ల శిఖా చెప్పింది. డబ్ల్యూపీఎల్‌లో బౌలింగ్ రికార్డు విషయానికొస్తే ఆరో అత్యధిక వికెట్ టేకర్‌గా నిలిచింది శిఖా. మూడు సీజన్లలో ఢిల్లీ తరఫున 27 మ్యాచులు ఆడిన తను 30 వికెట్లు తీసింది.

తండ్రికి బదిలీ కావడంతో.. కరీంనగర్‌లోని రామగుండంలో జన్మించిన శిఖా.. హిందీ టీచర్ తండ్రి సుభాష్ పాండేకు గోవాకు బదిలీ కావడంతో అక్కడే పెరిగింది. గోవా తరఫునే అంతరాష్ట్ర టోర్నీల్లో ఆడిన



ఆమె.. ఆ తర్వాత కెప్టెన్‌గా ఎదిగింది. దేశవాళీలో మెరిసిన శిఖా 2014లో బంగ్లాదేశ్‌పై అరంగేట్రం చేసింది. తద్వారా గోవా నుంచి భారత జట్టుకు ఎంపికైన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. తొమ్మిదేళ్లపాటు భారత క్రికెట్‌కు విశేష సేవలందించిందీ మీడియం పేసర్. రెండేళ్ల క్రితం చివరిసారి టీమిండియా జెర్సీ వేసుకున్న ఆమె ప్రస్తుతం ఫ్రాంచైజీ క్రికెట్‌లో రాణిస్తోంది. ఆటలోనే కాదు చదువులోనూ తను చురుకైన విద్యార్థే. గోవాలోనే ఇంజనీరింగ్ డిగ్రీ చదివిన శిఖా.. తర్వాత భారత వైమానిక దళంలోనూ కొన్నాళ్లు పనిచేసింది.




# స్వదేశంలో టీమిండియాకు శ్రీలంక సవాల్..

## వైజాగ్, త్రివేండ్రంలో మ్యాచ్‌లు..!

**న్యూఢిల్లీ:** ఇటీవలే విశ్వ విజేతగా అవతరించిన భారత జట్టు తొలి సిరీస్‌కు సన్నద్ధమవుతోంది. స్వదేశంలోనే ప్రపంచకప్‌ను సగర్వంగా ముద్దాడిన టీమిండియా ఉపఖండ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. డిసెంబర్‌లో ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరుగనుంది. దాంతో.. శుక్రవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు మ్యాచ్‌లకు రెండు నగరాలను మాత్రమే ఎంపిక చేసింది బీసీసీఐ.

వరల్డ్ కప్ తర్వాత కో హోస్ట్‌లు భారత్, శ్రీలంక తలపడుతున్న తొలి సిరీస్ ఇదే. డిసెంబర్ 21 నుంచి డిసెంబర్ 30 వరకూ జరుగబోయే ఐదు టీ20ల సిరీస్‌లో ఇరుజట్లు ఢీకొననున్నాయి. ఈ ఐదు మ్యాచ్‌లకు వైజాగ్, త్రివేంద్రం(తిరువనంతపురం) వేదిక కానున్నాయి. టీమిండియా ఈ ఏడాది జూన్‌లో చివరి పొట్టి సిరీస్ ఆడింది. అది కూడా ఇంగ్లండ్‌లో 3-2తో విజేతగా నిలిచింది హర్మన్‌ప్రీత్ సేన. లంక విషయానికొస్తే ఆ జట్టు మార్చిలో న్యూజిలాండ్‌తో ఆడిన సిరీసే ఆఖరు. ఆ సిరీస్‌ను ఇరుజట్లు 1-1తో సమం చేసుకున్నాయి.




తొలి టీ20-డిసెంబర్ 21 ఆదివారం, విశాఖపట్టణం
రెండో టీ20-డిసెంబర్ 23 మంగళవారం, విశాఖపట్టణం
మూడో టీ20-డిసెంబర్ 26 శుక్రవారం, తిరువనంతపురం
నాలుగో టీ20-డిసెంబర్ 28 ఆదివారం, తిరువనంతపురం
ఐదో టీ20-డిసెంబర్ 30, మంగళవారం, తిరువనంతపురం.

# హైదరాబాద్‌కు స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్..



## డిసెంబర్ 13న రానున్న మెస్సి

**హైదరాబాద్:** ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సి ఇండియాలో టూర్ చేయనున్న విషయం తెలిసిందే. అయితే ఆ లెజెండరీ ప్లేయర్ ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా అడుగుపెట్టనున్నాడు. ఈ విషయాన్ని అతను కన్ఫర్మ్ చేశాడు. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయాన్ని చెప్పాడు. మరికొన్ని వారాల్లో గోట్ టూర్ ప్రారంభంకానున్నదని, భారత్ ప్రదర్శిస్తున్న ప్రేమ పట్ల థ్యాంక్స్ చెబుతున్నట్లు పేర్కొన్నారు. తన విజిట్‌లో హైదరాబాద్ నగరాన్ని కూడా జోడించారని, ఇది సంతోషకరమైన విషయం అన్నారు. అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సి ఇండియాలోని కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలతో పాటు హైదరాబాద్‌లోనూ టూర్ చేయనున్నారు.

డిసెంబర్ 13వ తేదీన హైదరాబాద్ నగరానికి మెస్సీ వస్తున్నాడు. ఆ రోజు రాత్రి 7.30కు కార్యక్రమం జరగనున్నది. మెస్సీ రాకను స్వాగతిస్తూ ఇవాళ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఫుట్‌బాల్ ప్రేమికులకు, హైదరాబాద్ నగరానికి ఇది సంతోషకరమైన విషయం అన్నారు. మెస్సీకి ఘన స్వాగతం పలికేందుకు నగరం సిద్ధంగా ఉందన్నారు.

# రెండో టెస్టుకు కమిన్స్ దూరం..

## కెప్టెన్‌గా స్మిత్‌కు మరో ఛాన్స్..!

**పెర్త్:** యాషెస్ సిరీస్‌లో అదిరే బోణీ కొట్టిన ఆస్ట్రేలియా రెండో మ్యాచ్‌లోనూ విజయంపై కన్నేసింది. పెర్త్ టెస్టులో సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను రెండో రోజే మట్టికరిపించిన ఆసీస్ బ్రిస్బేన్‌లోనూ తడాఖా చూపేందుకు సిద్ధమవుతోంది. సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య జట్టు స్టార్ పేసర్ల సేవల్ని కోల్పోనుంది. గాయం నుంచి కోలుకుంటున్న కెప్టెన్ ప్యాట్ కమిన్స్, ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కూడా ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదు. దాంతో.. తొలి టెస్టు స్క్వాడ్‌తోనే కంగారూ టీమ్ రెండో మ్యాచ్ ఆడనుందని శుక్రవారం క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. యాషెస్‌లో మొదటిదైన పెర్త్ టెస్టులో సంచలన విజయంతో ఆస్ట్రేలియా సిరీస్‌లో ముందంజ వేసింది. కెప్టెన్ కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి ప్రధాన పేసర్లు లేకున్నా.. మిచెల్ స్టార్క్, బొలాండ్‌లు నిప్పులు చెరిగారు. 205 పరుగుల ఛేదనలో ట్రావిస్ హెడ్ విధ్వంసక శతకంతో రెండో రోజే ముగించిన ఆసీస్.. అదే ఉత్సాహంతో బ్రిస్బేన్ టెస్టులో బరిలోకి దిగనుంది. కానీ.. రెండో టెస్టు వరకూ కూడా కమిన్స్, హేజిల్‌వుడ్‌లు ఫిట్‌నెస్ సాధించేలా లేరు. దాంతో.. రెండో మ్యాచ్‌కు స్టీవ్ స్మిత్ సారథిగా కొనసాగనున్నాడు. అలానే.. తొలి మ్యాచ్‌లో వెన్నునొప్పితో ఇబ్బందిపడిన ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా కూడా స్క్వాడ్‌లో ఉన్నాడు. మ్యాచ్‌కు దూరమైనప్పటికీ జట్టుతోనే ఉంటూ ప్రాక్టీస్ కొనసాగించనున్నాడు కమిన్స్. డిసెంబర్ 3 నుంచి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య బ్రిస్బేన్‌లోని గబ్బాలో రెండో టెస్టు జరుగనుంది.



**ఆస్ట్రేలియా స్క్వాడ్ :** స్టీవ్ స్మిత్(కెప్టెన్), ట్రావిస్ హెడ్, స్కాట్ బొలాండ్, అలెక్స్ క్యారీ, బ్రెండన్ డొగెటే, కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, నాథన్ లియాన్, మైఖేల్ నాసిర్, మిచెల్ స్టార్క్, జేక్ వెదర్‌లాండ్, బ్యూ వెబ్‌స్టర్.

MOVIE TIME



# ఒక్క ఫెయిల్యూర్ నా ఆలోచనలను మార్చేసింది రకుల్

Rakul Preet Singh

టాకీస్: సినిమా ఇండస్ట్రీలో జయాపజయాలు సహజం. ఒక్కోసారి భారీ అంచనాలతో వచ్చిన సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తాకొడతాయి. అలాంటి ఓ భారీ బడ్జెట్ చిత్రం ఫెయిల్ అయినప్పుడు ఆ సినిమాలో నటించిన హీరోయిన్ ఎప్పుడూ లేనంతగా బాధపడిందట! ఎన్నో ఆశలతో ఆ సినిమా రిజల్ట్ కోసం ఎదురుచూసిన హీరోయిన్ ఒక్కసారిగా అంచనాలు తారుమారవడంతో ఒక్కసారిగా తన కెరీర్ ప్రశ్నార్థకంగా మారిందంటూ వాపోయింది. ఇంతకీ ఎవరా హీరోయిన్? అది ఏ సినిమా? టాలీవుడ్‌లోకి ఏటా చాలామంది కొత్త హీరోయిన్లు వస్తూనే ఉన్నారు. సినీపరిశ్రమలో తెలుగు వాళ్లకంటే ముంబై, కన్నడ భామలదే హవా నడుస్తోంది. పాన్ ఇండియా సినిమాలతో బాలీవుడ్ బ్యూటీలు కూడా టాలీవుడ్ బాట పడుతున్నారు. ఈ పోటీ తట్టుకుంటూ అవకాశాలు అందిపుచ్చుకుని స్టార్ హీరోయిన్‌గా రాణించడం ఒక ఛాలెంజ్ అనే చెప్పాలి. అలాంటి పోటీని తట్టుకుని తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుని స్టార్ హీరోల సరసన ఛాన్స్‌లు కొట్టేసిన ఒక స్టార్ హీరోయిన్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనసులో దాచుకున్న బాధను బయటపెట్టింది. తాను నటించిన ఓ సినిమా గురించి మాట్లాడుతూ 'నాకు ఎప్పుడూ లేనంత బాధ కలిగింది' అని చెప్పుకొచ్చింది. ఆ బాధ వెనుక ఉన్న కారణం ఆ సినిమా సూపర్ స్టార్‌తో కలిసి చేసిన ప్రాజెక్ట్ కావడం, భారీ అంచనాలు కల్పించడం, కానీ ఫలితం ఊహించని విధంగా మారిపోవడం. ఆ స్టార్ హీరోయిన్ ఎవరో కాదు రకుల్ ప్రీత్ సింగ్! రకుల్ మాట్లాడింది సూపర్‌స్టార్ మహేష్ బాబుతో కలిసి నటించిన 'స్పైడర్' (2017) సినిమా గురించి. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన ఈ స్పై థ్రిల్లర్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కినా, బాక్సాఫీస్ వద్ద భారీ నష్టాన్ని మూటగట్టుకుంది. 'ఆ సినిమా ఫలితం తర్వాత నా ఎక్స్‌పెక్టేషన్స్ పూర్తిగా కుప్పకూలాయి. ఎప్పుడూ లేనంత టెన్షన్, డౌట్స్ అన్నీ ఒక్కసారిగా వచ్చాయి' అని రకుల్ తన బాధ పంచుకుంది. అంతకు ముందు 8-9 వరుస హిట్స్ ఇచ్చిన రకుల్‌కు ఈ ఒక్క ఫెయిల్యూర్‌తో ఎంత గట్టి దెబ్బ తగిలిందో అర్థమవుతోంది. కానీ రకుల్ ఆ బాధను దాచుకోలేదు, దాన్ని లెసన్‌గా మార్చుకుంది. 'ఇప్పుడు స్క్రిప్ట్ సెలెక్షన్‌లో మరింత జాగ్రత్తగా ఉంటాను. ఒక్కో ప్రాజెక్ట్‌కు రెండుసార్లు ఆలోచిస్తాను' అంటూ జాగ్రత్తగా కథలు ఎంచుకోవడం మొదలుపెట్టింది. సినిమా ఇండస్ట్రీలో జయాపజయాలు రెండూ సహజమే అని రుజువు చేస్తూ రకుల్ మళ్లీ ఫామ్

# స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ

టాకీస్: యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది.స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి



పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

# వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్

టాకీస్: దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'రుద్ర' గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ అల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.





# భారీ అంచనాల మధ్య 5న వస్తోన్న దురంధర్

టాకీస్: బాహుబలి, పుష్ప2 లాంటి భారీ సినిమాల దెబ్బకి బాలీవుడ్ కూడా పూర్తిగా మారిపోయింది. ఇప్పటి దాకా లవ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ తో ఆకట్టుకున్న రణవీర్ సింగ్ కూడా ఇప్పుడు భారీ యాక్షన్ వైపు టర్న్ తీసుకుని,'ధురంధర్'అనే మాస్ యాక్షన్ థ్రిల్లర్ తో వస్తున్నాడు. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ కాంబినేషన్ లో డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది దురంధర్. ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందించబడిన ఈ సినిమాను 'ఉరి' దర్శకుడు ఆదిత్య ధర్ 250 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించాడు. ఇప్పటి కే రిలీజ్ అయిన ట్రయిలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. బి-టౌన్‌లో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ బయోపిక్ అని రూమర్స్ రావడంతో దర్శకుడు క్లారిటీ ఇస్తూ 'మోహిత్ శర్మ త్యాగం గొప్పది కానీ దానికి దురంధర్‌కి సంబంధం లేదు. టైమ్ వచ్చాక ఆయన బయోపిక్‌ను గొప్పగా చేస్తాం అని అన్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమా 3 గంటల 32 నిమిషాల రన్‌టైమ్ తో వస్తోంది. దాంతో దురంధర్ కూడా ఇండియా లాంగెస్ట్ రన్‌టైమ్ మూవీస్ లిస్ట్‌లోకి ఎంటర్ అవుతుంది. పాన్ ఇండియా వేవ్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్, పుష్ప 2, కల్కి, బాహుబలి ఎపిక్ లాంటి సినిమాలు లాంగ్ రన్‌టైమ్ తోనే రిలీజ్ అయ్యాయి. పాన్ వరల్డ్ హైప్ తో వచ్చి ఘన విజయం సాధించాయి కూడా. ఈ నేపథ్యంలో బాలీవుడ్ కూడా ఆ రూట్లో అడుగు వేస్తోందా అనే చర్చ బలంగా వినిపిస్తుంది.




# మీ అభిమానాలే నన్ను నిలబెట్టాయి: నవీన్

టాకీస్: టాలీవుడ్‌లో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన 'జాతిరత్నాలు'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా 'అనగనగా ఒక రాజు'ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు. దీర్ఘ విరామం తరువాత ఈ సినిమాను పూర్తిచేసిన నవీన్ ఇప్పుడు సంక్రాంతి 2026 కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ 'అనగనగా ఒక రాజు' ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. నాది సైలెంట్ బ్యాచ్ కాదు.. అల్లరి చేసే బ్యాచ్. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మీ అందరి సపోర్ట్ వల్లే. ఏజెంట్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి సినిమాలను మీరు ఎంత ప్రేమించారో తెలుసు. ఈ సినిమాను కూడా అదే ప్రేమతో ఆదరిస్తారని నమ్మకం ఉందన్నాడు. ఈ సినిమాలో పాట పాడాను, డ్యాన్స్ చేశాను? ఈ సారి పండగకి మీ ముందుకు రానున్నాను' అని అన్నారు. నవీన్ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు 'అనగనగా ఒక రాజు'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.



# రివాల్వార్ రీటాగా వచ్చిన కీర్తి సురేశ్

టాకీస్: ఓ వైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ జోరు చూపించే ప్రయత్నం చేస్తోంది కీర్తి సురేశ్. ఇప్పడామె నుంచి వచ్చిన యాక్షన్ సినిమా 'రివాల్వర్ రీటా'. పాండిచ్చేరిని అడ్డాగా చేసుకుని ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు డాన్ డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్). అతన్ని ఎలాగైనా హత్య చేసి తన సోదరుడి చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నర్సింహారెడ్డి (అజయ్ ఘోష్) ఓ ముఠాతో రూ.5 కోట్లకి ఒప్పందం కుదుర్చుకుంటాడు. దీనిలో భాగంగా పాండ్యన్‌ను హనీట్రాప్ చేసి చంపేందుకు ప్రణాళిక రచించగా.. అతను డ్రగ్స్ మత్తులో ఓ ఇంటికి వెళ్లబోయి పొరపాటున పక్క వీధిలో ఉన్న రీటా (కీర్తి సురేశ్) ఇంటికి వెళ్తాడు. అక్కడ అనుకోకుండా జరిగిన గొడవలో రీటా తల్లి (రాధికా శరత్ కుమార్) కొట్టిన దెబ్బకు పాండ్యన్ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తాడు. మరి ఆ తర్వాత ఏమైంది? డ్రాకులా పాండ్యన్ హత్య వల్ల రీటా కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? పాండ్యన్‌ను హత్య చేసి రూ.5కోట్లు కొట్టేయాలనుకున్న మార్టిన్ ముఠా వల్ల రీటాకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? తన తండ్రి జాడ వెతుక్కుంటూ వేట మొదలు పెట్టిన బాబీ పాండ్యన్ (సునీల్)కి రీటా కుటుంబం చేసిన పని గురించి తెలిసిందా? లేదా? అన్నది చిత్ర కథ. ఇది పగ, ప్రతీకారాలతో ముడిపడి ఉన్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్. కర్మ ఎవరినీ విడిచి పెట్టదు.. దాని ఫలితాన్ని అనుభవించక తప్పదనే కోణంలో సాగుతుంది. కథానాయిక కుటుంబంలో జరిగిన ఓ అన్యాయానికి కాలం కర్మ రూపంలో ఎలా బదులు తీర్చుకునే అవకాశమిచ్చిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. లైన్‌గా చూసినప్పుడు ఈ కథ




ఆసక్తిరేకెత్తించేలాగే ఉన్నా.. దాన్ని తెరపై ఆవిష్కరించిన విధానం ఏమాత్రం మెప్పించదు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌లో ఇటు నవ్వులు.. అటు థ్రిల్ ఏదీ సరిగ్గా పండలేదు. కథా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ సినిమాను మొదలు పెట్టిన దర్శకుడు.. డ్రాకులా పాండ్యన్ ప్రాణాలు కోల్పోవడంతో కీలక మలుపు తిప్పాడు. ఇక అక్కడి నుంచి ఇంట్లో శవాన్ని మాయం చేసేందుకు ఇటు రీటా కుటుంబం పడే పాట్లు.. అటు ఆ శవాన్ని దక్కించుకునేందుకు మార్టిన్ గ్యాంగ్ చేసే ప్రయత్నాలతో కథ ముందుకు సాగుతుంది.రీటా పాత్రలో కీర్తి సురేశ్ తెరపై అందంగా కనిపించింది. నటిగా ఇది ఆమెకు సవాల్ విసిరే పాత్రేమీ కాదు. సినిమా మొత్తం దాదాపు ఒకే ఎక్స్‌ప్రెషన్‌లో కనిపిస్తుంది. ద్వితీయార్ధంలో తనలోని యాక్షన్ కోణాన్ని రుచి చూపించింది. తల్లి పాత్రలో రాధికా శరత్ కుమార్ నటన అక్కడక్కడా నవ్వులు పూయించింది. ప్రతినాయకుడిగా బాబీ పాండ్యన్ పాత్రలో సునీల్ ఆద్యంతం సీరియస్ లుక్‌లోనే కనిపించారు.

# గందరగోళంగా విష్ణు విశాల్ ఆర్యన్

టాకీస్: తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన కథానాయకుడు విష్ణు విశాల్ కీలక పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఓ న్యూస్ ఛానల్‌లో జరుగుతున్న ఇంటర్వ్యూకు ప్రేక్షకుడిలా హాజరవుతాడు ఆత్రేయ (సెల్వ రాఘవన్). నయన (శ్రద్ధా శ్రీనాథ్) వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఆ షోకు వచ్చిన సెలబ్రిటీని కాలిపై తుపాకీతో కాల్చి లైవ్‌లో యావత్ ప్రపంచానికి ఓ సందేశాన్ని ఇస్తాడు. తాను ఒక రచయితనని, జీవితంలో ఫెయిల్ అయినట్లు చెబుతాడు. వచ్చే ఐదు రోజుల్లో ఐదు హత్యలు చేస్తానని.. గంట ముందు వారి పేరు చెబుతానని, ఈ హత్యలను ఎవరూ ఆపలేరని చెబుతూ తనని తాను కాల్చుకుని చనిపోతాడు. దీంతో పోలీస్‌శాఖ ఈ కేసును సీరియస్‌గా తీసుకుంటుంది. ఆత్రేయ చెప్పిన వాళ్ళెవరో కనిపెట్టి కాపాడాలని భావిస్తుంది. పనిలో నిజాయతీగా ఉండే పోలీస్ ఆఫీసర్ నంది (విష్ణు విశాల్)కి ఈ బాధ్యతలు అప్పగిస్తుంది. చనిపోయిన తర్వాత కూడా ఆత్రేయ వరుస హత్యలు ఎలా చేశాడు? వాటిని అడ్డుకునేందుకు నంది అతడి టీమ్ ఏం చేసింది? ఈ క్రమంలో వాళ్లకు ఎదురైన సవాళ్లు ఏంటి? కేవలం ఐదుగురినే హత్య చేయడంలో అంతర్యం ఏంటన్నది కథ. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తాయి మర్డర్ మిస్టరీ థ్రిల్లర్స్. హత్యలను ఛేదించడానికి లేదా సీరియల్ కిల్లర్ నుంచి వాటిని తప్పించడానికి కథానాయకుడు చేసే సాహసాలు, వేసే ఎత్తులు, పైఎత్తులు అన్నీ అలరిస్తాయి. 'ఆర్యన్' విషయంలో దర్శకుడు కొంతవరకూ సఫలం అయ్యారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా 'ఆర్యన్'ను ఆరంభించిన తీరు మెప్పిస్తుంది. అసలు చనిపోయిన వ్యక్తి మిగిలిన నలుగురిని ఎలా చంపుతాడా? అన్న ఆసక్తి సినిమా చూసే ప్రేక్షకుడిలో కలుగుతుంది. అదే సినిమా చూసేలా ప్రేక్షకుడిని సమాయత్తం చేస్తుంది.




ఆత్రేయ సవాల్‌ను స్వీకరిస్తూ పోలీసులు నందిని రంగంలోకి దింపడం వెంటనే అతడు ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టడంతో కథ, కథనాలు మరింత ఆసక్తికరంగా నడుస్తాయి. ఆ తర్వాత హత్యకు గురయ్యే వ్యక్తుల వివరాలు వెల్లడించేందుకు ఆత్రేయ ఎంచుకున్న మార్గం, వాడుకున్న టెక్నాలజీ పోలీసులతో పాటు ప్రేక్షకుడినీ థ్రిల్‌కు గురిచేస్తుంది. ఈ పోలీసులు సాగించే ఇన్వెస్టిగేషన్ మాత్రం రొటీన్ ఫార్మాట్‌లో ఉంటుంది. చివరిగా పోలీస్ ఆఫీసర్ నంది పేరును ఆత్రేయ ప్రస్తావించడంతో కథ ఒక్కసారిగా ఆసక్తికరంగా మారుతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.